# త్రిసంధ్య

హౌరా మెయిల్ వాల్తేరును సమీపిస్తోంది. అనంత మృదుహస్తాలు తనను తట్టి లేపుతుంటే ఆనందరావ్ బద్ధకంగా కళ్ళు తెరిచాడు. తెరుస్తూనే ఉలికి పడ్డాడు. అనంత రూపం అతడికి ఆనందంతో పాటు విస్మయాన్ని కూడా కలిగించింది. అనంత అంత అధునాతనంగా అలంకరించుకోవటం ఏదో సమస్య లాగ తోచింది.

పెదిముల మధ్యనించి చిరునవ్వుతో ''లేవండి...స్టేషన్ వచ్చేస్తోంది'' అంది.

లేచి కూడా ఆమెనే చూస్తుండిపోయాడు.

నైలాన్ జార్జెట్ చీర, మ్యాచింగ్ స్లీవ్ లేస్ బ్లౌజు వేసుకుంది.

పాలరాతి బొమ్మ లాగ ఉంది.

ఆధునిక వేషం...... అనంత లాంటి అందమైన అమ్మాయిల కోసమే అనిపించింది అతడికి. ఇంత సౌష్ఠవం...... సౌందర్యం లేకపోతే ఈ నాటి అలంకరణలు చాలా ఎబ్బెట్టుగా, అసహ్యం కలిగించేలా ఉంటాయి.

పైకి ఎత్తుగా ముడి వేసుకుంది. పొడుగ్గా లోలకులవంటివి చెవికి వ్రేలాడుతున్నాయి. చీర రంగులోనే నుదుట బొట్టు... పెదవులకి లేతగా లిప్‌స్టిక్... మోహనంగా ఉంది ఆమె రూపం.

అతడు లేచాక అనంత దిళ్ళు సర్దుతోంది. చెయ్యి పట్టుకున్నాడు. గాజుల చెయ్యి గలగల మంటుంటే ''అబ్బ ఉండండి'' అంది.

అనంత మొహంలో ఏదో చిరాకు!.... కాదు ఆలోచన.

''చాలా స్వీట్‌గా ఉన్నావమ్మాయ్. అంత కోపం... కాదు ఆలోచన ఏమిటో? అన్నాడు వదలకుండానే.

''మీ సమస్యేమీ కాదు లెండి!''

''ఓహో నీ సమస్యా?'' అన్నాడు ఆనందరావ్.

''స్టేషన్‌కి మా బావ వస్తాడనుకుంటాను'' అంది.

''ఏ బావ! ఓహో రామ్మోహనా? వస్తే!'' అన్నాడతను.

''అది మీకు అర్థం కాదులెండి'' అన్నట్లు నిర్లక్ష్యంగా చూపులు మరల్చుకుంది అనంత. రైలు ప్లాటుఫారమ్ మీదికి వచ్చేసింది.

అసలు ఈ ప్రయాణం అనుకోకుండా వచ్చింది.

పది రోజుల క్రిందట బెజవాడనుంచి అనంత తండ్రి ఉత్తరం రాశాడు. కాన్వొకేషన్ ఉంది. అనంతని పంపించమని, పండగల దాక బెజవాడలో ఉండి వస్తుందని, సెలవుంటే తాను కూడా తప్పకుండా కనీసం పండుగలకైనా రావలసిందనీ.

''ఇప్పుడు దీనికోసం ఊరి కెందుకు! నీవు వెళ్ళకుండానే తెప్పించుకోవచ్చు నీ డిగ్రీ'' అన్నాడు ఆనందరావ్.

''ఊహు, వెళ్ళి తీరాలీ. నా ఫ్రెండ్స్ వస్తారు. వాళ్ళని చూడాలి. అమ్మని చూసి ఆరు నెలలయింది. మీకు డబ్బు ఖర్చుకూడా కాదు. ఫస్టు క్లాసులో రిజర్వేషన్‌తో హాయిగా వెళ్ళిరావచ్చు.'' అంది.

''ఆ... వెళ్ళివస్తావ్ హాయిగా! నిన్ను పంపించను'' అన్నాడు.

''మీరు కూడా రండీ...'' అంది.

''పండగలకి నిన్ను ఉంచుకుని నన్ను తోలేస్తారు...''

''ఏమీ తోలరు... మీరూ ఉండండి...''

''పాపం— నాకేం ఉద్యోగం లేదు. నీతో తింటూ కూర్చోటం తప్ప. నువ్వు కూడా నాతో తిరిగి వచ్చేస్తానంటే ఒక పది రోజుల్లో...''

''సరే, మీతోటే వచ్చేస్తాను...'' అంది అనంత.

ఆనందరావ్ కలకత్తాలో రైల్వేలో పనిచేస్తున్నాడు. పెళ్ళయి అనంత వచ్చి ఆరు నెలలయింది. అతడి బావగారు తీసుకువచ్చాడీ సంబంధం. ఆ అమ్మాయి ఎమ్మే చదువుతోంది అంటే చాలా ఫ్యాషనబుల్‌గా ఊహించు కున్నాడు. సిటీలో రకరకాలైన అందాల్ని చూడటానికి అలవాటుపడ్డ కళ్ళతో, చూపులకి వెళ్ళినప్పుడు అతి సాధారణంగా కనిపించిన అనంతని చూడగానే నిరుత్సాహం కలిగింది అతడికి. అయినా అనంత రూపురేఖలు తను ఊహించనంత అందంగా ఆకర్షణీయంగా ఉన్నాయి.

బావగారు వాళ్ళకి ఫామిలీ ఫ్రెండు అవటంచేత ఆ కాసేపూ చక్కగా మాట్లాడింది. అతడికి నచ్చింది. ఒప్పుకున్నాడు. మాటల్లో తన సంశయం, నిరుత్సాహం గమనించి బావ అన్నాడు "దాని కాలోచన ఎందుకు? పెళ్ళయితే నీకు కావలసినట్లుంటుంది. కలకత్తా వెళ్ళిందంటే... అక్కడ వాతావరణం, నువ్వు వద్దన్నా మారిపోతుంది... తరవాత బజార్లు, టైలర్ల వెనక తిరగలేక నువ్వే బాధపడతావు" అని నవ్వాడు.

పెళ్ళి అయి కలకత్తా వచ్చాక కూడా ఆ ఆశ కనిపించలేదు ఆనందరావ్‌కి. షాపింగ్‌కి తీసుకువెళ్ళి అలంకరణ వస్తువులేమి కొనబోయినా "వద్దు" అనేది. గంట సేపు ఏరి తనకు కావలసిన రెండు నవలలు కొనుక్కువచ్చేది ఇంటికి.

"ఏమండీ అది కొనరూ" అని అనంత అడిగితే కొనిపెట్టాలని అతడి సరదా... తీరనేలేదు.

ఒకరోజు సినిమాకి వెడదాం అన్నాడు. స్నానం చేసి వచ్చి, జడ అల్లుకుని, పౌడరు వేసుకుని బొట్టు పెట్టుకుని "పదండి" అంది.

అనంతని చూస్తూనే ఉన్నాడతడు "ఇట్లాగేనా!" అన్నాడు.

"ఇంకా ఏమిటి?" అంది ఆశ్చర్యంగా.

నువ్వు కూడా ముడి వేసుకో... నీ ప్రెజెంటేషన్స్‌లో టాయ్‌లెట్ బాక్స్‌లు కూడా ఉన్నాయి. లిప్‌స్టిక్ వేసుకో."

'నాకు చేతకాదు. వేస్ట్ ఆఫ్ టైమ్... ఒక కథ చదివేసుకోవచ్చు.' అంది.

"ఎందుకు చేతకాదు! అందంగా ఉన్నాననుకుంటున్నావేమో! నా ఫ్రెండ్సు, వాళ్ళ భార్యలు నువ్వు ఎమ్మే చదివావంటే నమ్మరు."

చివరికి అతడు బ్రతిమాలితే అట్లాగే బయలు దేరింది.

అట్లా ఎన్నో ప్రోగ్రాములు పాడయ్యాయి.

అలంకరించుకోవటం ఫాషనయిన ఈ కాలంలో కూడా అనంత ఎందుకట్లాగా విముఖంగా ఉంటుందో అతడికి అర్థం అయ్యేది కాదు. ఏ కార్యక్రమాలకి వెళ్ళినా క్లబ్బుకు వెళ్ళినా ఎమ్మే చదివిన పిల్ల ఇంత సింపుల్‌గా ఉండటమేమిటని నమ్మలేనట్లుగా చూసేవారు ఆడవాళ్ళు.

కానీ పోటీలో అద్భుతంగా పాడి, టేబుల్ టెన్నిస్‌లో గెలిచి అందరికీ స్నేహితురాలైపోయింది అనంత. కొన్ని నెలలు గడిచాయి. ఒక రోజు తనే అంది.

"బజారుకు వెడదాం. చెవులకి బంగారు రింగులు కొనుక్కోవాలి" అని.

అప్పటినుంచి రెండు జడలు వేసుకుని రింగులు పెట్టుకోవటం మొదలు పెట్టింది. మీ అందరిలో నేను ఎవరికీ తీసిపోను అన్నట్లుగా అలంకరించు కోవటం ఫాషనబుల్గా ఉండటం ప్రారంభించింది. కానీ అతిగా అలంకరించు కోవటమంటే ఇప్పటికీ అసహ్యమే అనంతకి.

నల్లగా ఉన్నవాళ్ళు స్లీవ్‌లెస్ వేసుకున్నా,

ముఖాలలో కళ లేని వాళ్ళు హెయిర్ స్టయిల్ చేసినా,

వీళ్ళు సింపుల్గా ఎందు కుండరు! అనేది.

అన్నిటికంటె అనంతకి అసహ్యమైంది లిప్‌స్టిక్ వేసుకోవటం.

''ఈ అమ్మాయి నామాటలన్నీ ఇట్లాగ కొట్టిపారేస్తుంటే ఇంక కాపురం సాగేది ఎట్లాగ? జన్మ కత్తిమీద సాము కాబోలు!'' అనుకున్నాడు. ఇప్పుడు అనంత తన అభిరుచుల కనుగుణంగా నడుచుకుంటుంటే అతడికి ఆశ్చర్యం ఆనందం కూడా కలిగాయి. ఇప్పుడు అనంత పెదవులమీద లిప్‌స్టిక్ అతడికి ప్రశ్నార్థకంలా కనిపిస్తోంది.

రామ్మోహన్ కారు తీసుకువచ్చాడు స్టేషన్‌కి. వాళ్ళింట్లోనే దిగమని అనంత తండ్రి ఉత్తరంలో రాశాడు.

మనిషి హుందాగా బాగానే ఉన్నాడు. సరదాగా కూడా మాట్లాడుతాడు. అనంతని చూస్తూ ''కలకత్తా నీళ్ళు వంట పట్టినట్లున్నాయే, చాలా మారిపోయావు'' అన్నాడు.

నవ్వింది అందంగా.

''నేనేమీ మారలేదు. ఈయనకి ఇట్లాగ ఉండటం ఇష్టం'' అంది ఆనందరావ్‌ని చూపిస్తూ.

రామ్మోహన్ చూపులు తరచూ అందంగా ఉన్న అనంత మొహం మీద బుజాలమీద వాలుతున్నాయి. మెళ్ళో గొలుసును చేతి వ్రేళ్ళతో తిప్పుతూ అతడినేవో ప్రశ్నిస్తోంది అనంత.

హఠాత్తుగా ఆనందరావ్‌కి ప్రశ్న కలిగింది, ''ఇంత మంచి బావని అనంత ఎందుకు పెళ్ళి చేసుకోలేదు! నన్ను ఎందుకు చేసుకుంది!''

ఆ రోజు సాయంత్రం కాన్వొకేషన్ అయింది. స్నేహితులతో అనంతకి సరదాగా గడచిపోయింది. మరునాడు ఒక రోజు ఉండమంది అనంత అత్తయ్య. రామ్మోహన్ కాల్‌టెక్స్, ఏరోడ్రోమ్, హార్బర్ అన్నీ చూపించాడు కారులో. అతడు కాల్‌టెక్స్‌లో మూడు వేలు నెలకి సంపాదిస్తున్నాడు. అతడికీ అనంత పెళ్ళి అవగానే పెళ్ళయింది. భార్య పుట్టింటికి వెళ్ళిందిట ఇప్పుడు.

''పది రోజులు ఇక్కడ నెల అక్కడ ఏమిటో నీరసం అంటుంది అస్తమానమూను'' అంది అత్తయ్య తన కోడల్ని గురించి చెప్తూ. పదిహేను వేలు కట్నం తెచ్చిందిట. కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతూ పెళ్ళి అయిందని మానేసిందిట.

''మావాడు చదువు పూర్తిచెయ్యమనే అన్నాడు. ఆ పిల్లకే ఇష్టం లేదు'' అని కూడా అంది.

'ఏలే ఈ అబ్బాయి కట్నం పుచ్చుకోలేదూ'' అనడిగిందావిడ ఆనందరావు నుద్దేశించి.

''ఏం తప్పా!'' అంది అనంత కొంటెగా నవ్వుతూ.

అక్కడ ఉన్న రెండు రోజులు కూడా అనంత ప్రవర్తన ఆనందరావ్‌ని తికమక పెట్టింది. ఇంట్లో ఉన్నప్పుడు తన పనులు తను చేసుకుంటుంటే పట్టించుకోకుండా నవలలు చదువుకుంటూ పడుకునే అనంత తనకి తువ్వాలు అందించటం, స్నానం చేసి వస్తే తల తుడవటం కోటు తొడగటం వంటి పనులు చేసేది. వంటింట్లోకి వెళ్లి ఆయనకి ఆమ్లేట్ ఇష్టం అని స్వయంగా తయారుచేసి తెచ్చిపెట్టేది. అతడి పనులలో ఎప్పుడూ లేని శ్రద్ధ.

ఏదో కొత్త అవతారం దాల్చినట్లు మారిపోయింది.

స్టేషన్‌కి వచ్చాడు రామ్మోహన్. రైలు కదలబోతుంటే ఆనందరావ్‌తో.

''మీరు అదృష్టవంతులు. మా అనంతని చేసుకున్నందుకు'' అన్నాడు.

ఆనందరావ్ అయోమయంగా చూశాడు అనంతవైపు.

అనంత కళ్లలో గర్వం తొణికింది.

''నువ్వూ అదృష్టవంతుడివే, నీ కోరిక నెరవేరింది. మీ ఆవిడ పదిహేను వేలు కట్నంతో వచ్చింది'' అంది అనంత.

రైలు కదిలింది...అనంత చెప్పటం ప్రారంభించింది...

''చిన్నప్పుడు చూసి ఉంటే బావ అని మనసు పడి ఉండేదాన్నేమో కానీ యూనివర్సిటీలో ఉండగా పరిచయం అయింది.

ఈవిడ మా స్వంత మేనత్త కాదు. వరసకి అత్తయ్య అవుతుంది. అప్పటికి మేము అంటే నా స్నేహితురాళ్ళు అందరం కలిసి మగవాళ్ళ స్వభావాల్ని పరిశీలించి విమర్శించే వాళ్ళం. వాళ్ళ దుర్గుణాల్ని ఆడిపోసుకునే వాళ్ళం.

అందుకని అంత అమాయకంగా ఉండేవాళ్ళం కాదు. కొంచెం జ్ఞానం ఆలోచనా కలిగి ఉన్నాను.

ఇతనికి స్టేట్స్‌కి వెళ్ళానని...పెద్ద ఉద్యోగమని మహా గర్వం.

అతనే చెప్పేవాడు... పదిహేను వేలు కట్నం కావాలిట కనీసం. ఇంగ్లీషు లోనే మాట్లాడాలిట. చికిన్... ఫిష్... నాన్ వెజిటేరియన్ వండి పెట్టాలిట. తాగి ఇంటికి వచ్చినా ఏమీ అనకూడదుట. అతడి స్నేహితులతో సరదాగా ఉండాలట. ఇట్లాగ అడ్డు లేని కోరికలు నియమాలు ఏకరువు పెట్టాడు మా ఇంటికి వచ్చినప్పుడు. అవేమీ నేను చెయ్య లేనని చెప్పాను. అంతే కాదు. అసలు సంగతి మేము కట్నం ఇవ్వమని చెప్పాను. అది అసలు కారణం. పెళ్ళి కుదరలేదు. నన్ను చూసి వెళ్ళిన పెళ్ళి కొడుకుల్లో ఇతడు ఒకడు!''

''నాకూ ఇచ్చారు కదూ ఆరు వేలూ!'' అన్నాడు ఆనందరావ్.

''అది మీ మంచితనానికి... నామీద అభిమానానికి గుర్తుగా మా వాళ్ళిచ్చిన కానుక. కట్నం కాదు. కట్నమంటే బేరమాడి పుచ్చుకునేది. నయాపైసా తక్కువైతే పీటల మీదనుంచి లేచిపోవాలి కట్నమంటే' అంది అనంత కొంచెం తీక్షణంగా.

''సరే...నీ కొత్త అవతారం అంటే నాకు సేవ చెయ్యటం ఇదంతా ఏమిటి? దీని భావమేమి తిరుమలేశ!'' అన్నాడు ఆనందరావ్!

''అతడిని గ్రహించుకోమని చెప్పటం! అవన్నీ ముందు అడగవలసిన విషయాలు కావు. భర్త భార్య మనసులో చోటు చేసుకుంటే అతని కనుగుణంగా మారిపోతుంది. మరీ దుర్మార్గుడైతే తప్ప''

''పాపం బాధపడి ఉంటాడు.''

''పడాలనే; నేను బాధపడినప్పుడో. అతడు నన్ను అట్లాగ నిలదీసి అడిగితే నేను బాధపడలేదూ'' అంది అనంత.

* * * *

ఎప్పుడూ నిద్రే. రైలు కదిలితే చాలు. జోల పాడినట్లు నిద్రపోతారు. బెజవాడ వస్తోంది లేవండి'' అంది అనంత.

కళ్ళు తెరచిన ఆనందరావు బద్ధకం క్షణంలో వదిలిపోయింది.

అనంతని చూసి అతడు చకితుడయ్యాడు.

నుదుట పెద్ద బొట్టు. కళ్లకి కాటుక. పొడుగు జడలో గులాబీలు కనకాంబరాల మాల. గళ్ల పట్టు చీర కట్టుకుంది. వేషం మారిపోయింది. ఇంకేం పని ఉంది! కంపార్టుమెంటులో ఎవరూ లేరు కూడాను.

''ఫాన్సీ డ్రెస్ పోటిలో నీకు ఫస్టు ప్రైజు వస్తుంది'' అన్నాడు ఆనందరావు.

''ఎక్కడ జరుగుతాయి ఆ పోటీలు ఆంధ్రా ఎసోసియేషన్ ఏమైనా ఏర్పాటు

చేస్తున్నారా?'' అంది అనంత కుతూహలంగా.

''వాల్తేరు దాకా ఆధునిక యువతి. అక్కడ నుంచి ఆంధ్ర వనిత! ఇప్పుడు ''ఏమిటీ వేషం! ఎవరి నేడిపించటానికి?'' అన్నాడు చిరాగ్గా ఆనందరావు.

''ఇదేం వేషం కాదు. నా అసలు వేషం ఇదే'' అంది అనంత.

నన్నేడిపించటానికి కాబోలు రెండు జడలు ఎందుకు వేసుకోలేదూ''

''రెండు జడలా!'' అని పరధ్యానంగా అయిపోయింది అనంత.

ఒక నిమిషం తరవాత చెప్పటం ప్రారంభించింది.

''మీకెప్పుడూ మా నాన్నగారి సంగతి చెప్పలేదు కదూ. మా న్నాగారికి చదువు మీద ఎంత ఆసక్తో, ఈ వేషధారణలమీద అంత అసహ్యం. పద్ధతిగా ఉండాలంటారు. నేను కాన్వెంటుకి వెళ్ళేదాన్ని. మా స్కూల్లో పిల్లలు బొట్టు పెట్టుకునేవారు కాదు. అన్నం తిని బేగ్ తీసుకుని హాలులోంచి వెళ్ళాలి. అక్కడ నాన్నగారు పేపర్ చదువుతూ కూర్చునేవారు. వెడుతూంటే తప్పకుండా చూచేవారు.

నుదుట బొట్టు లేకపోతే ''వెళ్ళి బొట్టు పెట్టుకో తల్లీ'' అనే వారు.

అంతే సిగ్గు వేసేది. అందుకని బొట్టు పెట్టుకునే బయలుదేరేదాన్ని. ఇల్లు దూరమయ్యాక ఆ బొట్టు గిల్లి పారేసేదాన్ని.

రెండు జడలు వేసుకుంటే ''ఏమిటా వేషం!'' అనేవారు.

దారిలో నా స్నేహితురాలు మాలతి ఇంటికి వెళ్ళేదాన్ని. అక్కడ వాళ్ళక్క చేత రెండు జడలు వేయించుకుని మళ్ళీ ఇంటికి వచ్చేటప్పుడు ఒక్క జడ అల్లించుకు వచ్చేదాన్ని. కానీ పెద్దదాన్ని అవుతుంటే నాన్నగారికి ఇష్టం వచ్చినట్లుగానే ఉండాలనిపించేది. అట్లాగ ఉండటం సంతోషంగా ఉండేది. అందుకని ఒక జడ, బొట్టు కాటుక, పూలు, నాకు ఇష్టం. అలవాటు.'' అని ముగించింది అనంత.

''ఇప్పుడు మీ నాన్నగారు స్టేషన్‌కి వస్తారని ఇట్లాగ తయారయ్యావన్నమాట!'' అన్నాడు ఆనందరావ్.

ట్రైన్ విజయవాడ ప్లాట్‌ఫారమ్ చేరుకుంటోంది.

''మీ నాన్నగారంటే ఇప్పుడు కూడా నీకంత భయం ఎందుకు?'' అన్నాడు.

వాళ్ళ నాన్నగారికోసం కుతూహలంతో తలుపుదగ్గర నిలబడిన అనంత వెనక్కు తిరిగి అతడిని చూస్తూ.

''భయమేమిటి! ఇందాకటి వేషంలో ఉంటే మా నాన్నగారు నన్ను చూసి అయ్యో ఇది అనంత అనుకున్నాను. ఎవరో బెంగాలీది అనుకుంటూ వెళ్ళి పోతారు

తెలుసా!'' అంది.

అంతలో తండ్రిని గుర్తించిన కళ్లు ప్రఫుల్లాలయ్యాయి. మెల్లగా చేయి ఊపింది. ఆనందరావ్ కూడా అనంత పక్కన జేరాడు.

రైలు ఆగింది. అనంత దిగుతుంటే ''జాగ్రత్తగా దిగమ్మా'' అంటూ ''ప్రయాణం కులాసాగా జరిగిందా'' అని ఆనందరావ్‌ని ప్రశ్నించాడాయన.

''ఏమి అపురూపం ఫస్టుక్లాసులో వచ్చినా'' అని మనసులో అనుకుని ''హాయిగానే ఉంది'' అన్నాడు మామగారితో ఆనందరావ్.

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. పండగ దాకా ఉండమంటే వినలేదు అనంత.

''హోటల్ భోజనం పడటంలేదు'' అన్నాడు ఆనందరావ్. అనంత తల్లి అక్కయ్య నవ్వుకున్నారు. ఎనిమిదవ రోజున మెయిల్ ఎక్కేశారు.

రైలు కదిలి ప్లాట్‌ఫారమ్ దూరమయింది.

అనంత జడ విప్పేసి రెండు జడలు వేసుకుంది. హాండ్ బ్యాగ్ లోంచి రింగులు తీసి పెట్టుకుని దుద్దులు పెట్టేసింది లోపల.

''పేరాపాళాలు లేదు... వేషం మార్చమంటే ఏం ఓపిక నీకు!'' అన్నాడు ఆనంద్.

''ఇది నా శాశ్వతమైన వేషం! ఇంక వేషం మార్చాల్సిన అవసరంలేదు. మీకు నచ్చినట్లు... నాకు ఇష్టమైనట్లు... ఏమంటారు! అంది అనంత.

''నిజంగా నీకు రెండు జడలూ, రింగులే బాగుంటాయి. ఐనా క్షణ క్షణముల్ జవరాండ్ర వేషముల్'' అన్నాడు. ఆనందరావు.

''మీకేం ఊరికే మాటలు అంటారు. మేమెంతమందిని తృప్తి పరచాలి! ఒక నిశ్చితాభిప్రాయంతో ఉండాలంటే అది జీవన్మరణ సమస్య అవుతుంది.

ఇరవయ్యేళ్ళు తల్లి దండ్రుల పెంపకం! మొగుడు వచ్చిన మర్నాడే మరిచి పోవాలి. ఆయనగారి కనుగుణంగా మారిపోవాలి. మధ్యలో మా శత్రువుల్ని ఏడిపించటం మిత్రుల మెప్పు పొందటం వంటి వ్యక్తిగతమైన విషయా లుంటాయి. అయినా శాశ్వతమైంది, శాంతి నిచ్చేది... మీ కిష్టమైనట్లు ఉండటం తప్పని సరి! ఇన్ని అవస్థల్ని మేము ఎదుర్కోవలసి ఉంటే ఒక్క ముక్కలో మీరు 'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అనేస్తారు.'' అంది అనంత. కళ్ళల్లో ఛమత్ కారం తొణికిస్తూ మాటలతో పెదవులు వంపులు తిరుగుతూంటే అనంత చాలా చాలా ముద్దు వచ్చింది ఆనందరావ్‌కి.

రైలు చక్రాలు సంగీతం పాడుతూ పరిగెత్తాయి.

* * * *